కవిత అరెస్టుపై..
రాష్ట్రవ్యాప్తంగా నిరసన

4లో.

RNI NO :Title-Code :-TELTEL02102

జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక
అనుక్షణం ప్రజలపక్షం...

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
వార్త KKR NEWS
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

సంపుటి - 1 సంచిక - 171 ఆదివారం 17 మార్చి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

బీజేపీ అంటే బాబు, జగన్, పవన్

: విశాఖ సభలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

రాష్ట్రాలుగా విడిపోయినా తెలుగువారిగా కలిసి ఉందామన్న తెలంగాణ సీఎం
చంద్రబాబు, జగన్ ఎవరు గెలిచినా మోదీ వైపే ఉంటారని విమర్శ
చంద్రబాబు, జగన్ చెరో అయిదేళ్ళు ఉన్నా పోలవరం ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్న

మార్చి16(జర్నలిస్ట్ వార్త)విశాఖ : విశాఖ స్టీల్ ప్లాంట్ మైదానం వేదికగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏపీ సీఎం జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లపై విరుచుకుపడ్డారు. శనివారం సాయంత్రం విశాఖ స్టీల్ ప్లాంట్ మైదానంలో జరిగిన 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఏపీలో జగన్, చంద్రబాబు ఎవరు గెలిచినా మోదీ వైపే ఉంటారని విమర్శించారు. బీజేపీ అంటేనే బాబు, జగన్, పవన్ కల్యాణ్ అని కొత్త అర్థం చెప్పారు.

మిగతాది 2లో...

సార్వత్రిక ఎన్నికలకు మోగిన నగారా

ఏపీలో మే 13న ఎన్నికలు...
ఏడు దశల్లో లోక్ సభ ఎన్నికలు
ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన సీఈసీ రాజీవ్
ఎన్నికల కోడ్ అమల్లోకి!

కేంద్ర ఎన్నికల సంఘం నేడు సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. 18వ లోక్ సభ ఎన్నికలతో పాటు, 4 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు కూడా వివిధ దశల్లో నిర్వహించేలా షెడ్యూల్ ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికలు 3 దశల్లో నిర్వహించనున్నారు. వీటిలో పలు రాష్ట్రాల్లోని 26 ఉప ఎన్నికలు కూడా ఉన్నాయి. లోక్ సభ ఎన్నికలు 7 దశల్లో జరగనుండగా, ఏప్రిల్ 19 నుంచి పోలింగ్ జరగనుంది. అన్ని అసెంబ్లీలు, ఉప ఎన్నికలు, లోక్ సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్ 4న చేపట్టనున్నారు.

మిగతా 2లో.

ఈడీ కస్టడీకి కవిత

7 రోజులపాటు ప్రశ్నించేందుకు ఈడీ అధికారులకు అనుమతి
ఈ నెల 23 వరకు కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు
ఉత్తర్వులు జారీ చేసిన న్యాయమూర్తి నాగ్‌పాల్

జర్నలిస్ట్ వార్త): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో నిందితురాలిగా ఉన్న ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కవితను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ ఢిల్లీలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం రౌస్ అవెన్యూ కోర్టు శనివారం ఆదేశాలు జారీ చేసింది. రేపటి (18) నుంచి 23 వరకు కస్టడీకి అప్పగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు ప్రత్యేక న్యాయమూర్తి నాగ్‌పాల్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు 7 రోజులపాటు ప్రశ్నించనున్నారు. ఈ వారం రోజులపాటు కవిత ఈడీ కార్యాలయంలోనే ఉండాల్సి ఉంటుంది. 7 రోజుల పాటు ప్రశ్నించిన అనంతరం మార్చి 23న మధ్యాహ్నం 12 గంటల తర్వాత మరోసారి ఆమెను రౌస్ అవెన్యూ కోర్టులో ప్రవేశపెట్టాల్సి ఉంటుంది.కాగా శుక్రవారం

ROUSE AVENUE DISTRICT COURT
राउज़ एवेन्यू जिला न्यायालय

సాయంత్రం హైదరాబాద్‌లోని నివాసంలో కవితను అరెస్ట్ చేసిన ఈడీ అధికారులు ఢిల్లీకి తరలించారు. శనివారం ఉదయం వైద్య పరీక్షల అనంతరం రౌస్ అవెన్యూ కోర్టులో జడ్జి ముందు ప్రవేశపెట్టారు.

బీఎస్పీకి రాజీనామా..

బీఆర్ఎస్ లోకి ప్రవీణ్ కుమార్

తెలంగాణ రాజకీయాల్లో మరో సన్నివేశం
ఇటీవలే బీఆర్ఎస్ తో బీఎస్పీ పొత్తు
ఇంతలోనే బీఎస్పీకి గుడ్ బై చెప్పిన ప్రవీణ్



మార్చి16(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక సన్నివేశం చోటుచేసుకుంది. బీఎస్పీకి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాజీనామా చేశారు. బీఆర్ఎస్ లో ఆయన చేరబోతున్నారు. కేసీఆర్ తో ప్రవీణ్ భేటీ అయ్యారు.

మిగతాది 2లో...

వంద రోజుల పాలన పూర్తి సంతృప్తినిచ్చింది

కాంగ్రెస్‌ను దొంగదెబ్బ తీయడానికి బీజేపీ, బీఆర్ఎస్‌ల డ్రామా: సీఎం రేవంత్
కవిత అరెస్టుపై ఆమె తండ్రి, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ మౌనం ఎందుకు?
ప్రధాని కూడా దీనిపై మాట్లాడరేంటి?
అరెస్టు సానుభూతితో బీఆర్ఎస్.
. అవినీతిని సహించబోమంటూ బీజేపీ ఓట్లు దండుకునే యత్నం
తెలంగాణ సమాజం దీన్ని గమనించాలి..

మార్చి16(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ : రాష్ట్రంలో వందరోజుల పాలన పూర్తయిన సందర్భంగా సీఎం రేవంత్ తన నివాసంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్, డాక్టర్ రోహిణ్‌రెడ్డి తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు.

మిగతా 2లో.

ఇన్నాళ్లు బీఆర్ఎస్ అవినీతికి పాల్పడితే ఇప్పుడు కాంగ్రెస్ వంతు వచ్చింది

ప్రధాని మోదీ విమర్శలు

మార్చి16(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ :

యాదగిరిగుట్టలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు చిన్నపీట వేసి కాంగ్రెస్ పార్టీ అవమానించిందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. నాగర్‌కర్నూలులో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రజల కోసం తాము కోటి బ్యాంకు ఖాతాలు తెరిచామన్నారు. కోటిన్నర మందికి బీమా ఇచ్చామని, 67 లక్షల మందికి ముద్రా రుణాలు అందించామన్నారు. 80 లక్షల మంది ఆయుష్మాన్ పథకం కింద లబ్ధి పొందారన్నారు. బీజేపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, రైతులకు ఎక్కువ ప్రయోజనం జరిగిందన్నారు.కాంగ్రెస్ సామాజిక న్యాయం పేరుతో రాజకీయంగా పబ్బం గడుపుకుంటోందన్నారు. గిరిజన మహిళ ద్రౌపది ముర్మును రాష్ట్రపతి ఎన్నికల్లో ఓడించేందుకు ప్రయత్నించారని విమర్శించారు.

కేసీఆర్ దళితబంధు పేరిట మోసం చేశారన్నారు. తెలంగాణకు తొలి ముఖ్యమంత్రిగా దళితుడిని చేస్తానని మోసం చేశారని, కొత్త రాజ్యాంగం రాస్తామంటూ అంబేద్కర్‌ను అవమానించారని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తెలంగాణ ప్రజలు కూడా బీజేపీనే కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజల కలలను బీఆర్ఎస్, కాంగ్రెస్ చిదిమేశాయన్నారు. ఇన్నాళ్లు బీఆర్ఎస్ అవినీతికి పాల్పడితే ఇప్పుడు కాంగ్రెస్ వంతు వచ్చిందన్నారు. తెలంగాణను మరింత నాశనం చేసేందుకు కాంగ్రెస్ పార్టీకి ఈ అయిదేళ్లు చాలని విమర్శించారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామన్నారు. పగలు, రాత్రి మీ కోసం పని చేస్తానన్నారు. నిన్న మల్కాజిగిరిలో తనకు ప్రజల నుంచి మంచి మద్దతు లభించిందన్నారు. గరీబీ హఠావో అని కాంగ్రెస్ దశాబ్దాలుగా చెప్పినా ఇంతవరకు పేదరికం పోయిందా? అని నిలదీశారు. దేశంలో బీజేపీకి మెజారిటీ వచ్చాకే మార్పు మొదలైందని... మార్పుకు మోదీది గ్యారెంటీ అన్నారు.

బీజేపీ అంటే బాబు, జగన్, పవన్

(మొదటి పేజి తరువాయి)

ఇప్పుడు ఏపీకి కావాల్సింది పాలకులు కాదని... ఢిల్లీలో ప్రశ్నించే గొంతు అన్నారు. మనం తెలుగువాళ్లం.. మనమంతా అన్నదమ్ములం... రాష్ట్రాలుగా విడిపోయినా తెలుగువారిగా కలిసి ఉందామన్నారు.ఏపీలో పదేళ్ళుగా ప్రశ్నించే గొంతుకలు లేవన్నారు. ఢిల్లీలో ఉన్న మోదీ ఇక్కడి వారి ద్వారా ఏపీని శాసించాలని అనుకుంటున్నారని ఆరోపించారు. జగన్, చంద్రబాబు ఏపీ ప్రయోజనాల కోసం ఈ పదేళ్లలో ఎప్పుడూ కొట్లాడలేదని విమర్శించారు. ఢిల్లీని అడిగి.. ప్రశ్నించి ఏపీకి లాభం చేసే నాయకులు లేకుండా పోయారన్నారు. ఏపీలో మళ్లీ వారిద్దరిలో ఎవరు గెలిచినా మోదీ దగ్గరకే వెళతారని గుర్తించాలన్నారు. జగన్, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు మోదీని ఎదిరించి నిలిచే శక్తి ఉందా? అని ప్రశ్నించారు.కానీ షర్మిల మీకు అండగా నిలబడుతుందని... మీ కష్టాలలో తోడుగా ఉండాలని ఇక్కడకు వచ్చిందని చెప్పారు. అందుకే ఆమెను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు, జగన్ ఢిల్లీలో మోదీని ప్రశ్నిస్తారా? అని నిలదీశారు. అసలు ఏపీకి ఏమైనా తీసుకు వస్తారా? అన్నారు. అదే జరిగితే చంద్రబాబు అయిదేళ్లు, జగన్ మరో అయిదేళ్లు ఉంటే కనీసం పోలవరం ప్రాజెక్టు ఎందుకు పూర్తి కాలేదు? అని ప్రశ్నించారు

సార్వత్రిక ఎన్నికలకు మోగిన నగారా

అసెంబ్లీ ఎన్నికలు

(మొదటి పేజి తరువాయి)

ఏపీలో మే 13, అరుణాచల్ ప్రదేశ్, సిక్కింలో మే 19న, ఒడిశాలో తొలి దశ అసెంబ్లీ ఎన్నికలు మే 13న, రెండో దశ ఎన్నికలు మే 20న నిర్వహించనున్నారు. ఏపీలో జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్నాయి.

ఏపీ ఎన్నికలకు ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల కానుండగా... ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన జరుపుతారు. నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 29 వరకు గడువు విధించారు. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపడతారు.

లోక్ సభ ఎన్నికలు

ఇక లోక్ సభ ఎన్నికలను ఏడు దశల్లో నిర్వహిస్తున్నారు. 22 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఒకే విడతలో లోక్ సభ ఎన్నికలు నిర్వహించనున్నారు.

కర్ణాటక, రాజస్థాన్, త్రిపుర, మణిపూర్ రాష్ట్రాల్లో రెండు విడతల్లో లోక్ సభ ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఛత్తీస్ గఢ్, అసోం రాష్ట్రాల్లో మూడు విడతల్లో లోక్ సభ ఎన్నికలు జరపనున్నారు. ఒడిశా, మధ్యప్రదేశ్, ఝూర?ండ్ రాష్ట్రాల్లో 4 విడతల్లో లోక్ సభ ఎన్నికలు జరగనున్నాయి.

మహారాష్ట్ర, జమ్మూ కశ్మీర్ లో 5 విడతల్లో... ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో 7 విడతల్లో లోక్ సభ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మూడు రాష్ట్రాల్లో ప్రతి దశలోనూ కొన్ని లోక్ సభ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి.

పోలింగ్ ఎప్పుడంటే...

తొలి దశ ఎన్నికలకు మార్చి 20న నోటిఫికేషన్ విడుదలవుతుంది. ఏప్రిల్ 19న పోలింగ్ జరుగుతుంది. ఈ విడతలో 102 లోక్ సభ స్థానాలకు పోలింగ్ జరుగుతుంది.

రెండో దశ ఎన్నికలకు మార్చి 28న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఏప్రిల్ 26న పోలింగ్ నిర్వహించనున్నారు. రెండో దశలో 89 లోక్ సభ స్థానాలకు పోలింగ్ చేపడతారు.

మూడో దశ లోక్ సభ ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 12న విడుదల కానుంది. మే 7న పోలింగ్ జరగనుంది. మూడో దశలో 94 లోక్ సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది.

నాలుగో విడత లోక్ సభ ఎన్నికలకు ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల కానుంది. మే 13న పోలింగ్ నిర్వహిస్తారు. ఈ విడతలో ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో లోక్ సభ ఎన్నికలు జరుగుయి. నాలుగో దశలో 96 స్థానాలకు పోలింగ్ జరుగుతుంది

ఐదో విడత లోక్ సభ ఎన్నికలకు మే 20న పోలింగ్ జరగనుంది. ఐదో దశలో 49 లోక్ సభ స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు.

ఆరో విడత లోక్ సభ ఎన్నికలకు ఏప్రిల్ 29న నోటిఫికేషన్ విడుదల కానుండగా, మే 25న పోలింగ్ జరగనుంది. ఆరో విడతలో 57 లోక్ సభ స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు.

ఏడో విడత ఎన్నికలకు మే 7న నోటిఫికేషన్ విడుదల కానుండగా, జూన్ 1న ఎన్నికలు జరగనున్నాయి. చివరిదైన ఏడో విడతలో 57 లోక్ సభ స్థానాలకు పోలింగ్ జరుగుతుంది

17వ లోక్ సభ గడువు జూన్ 16తో ముగియనుండగా.... అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీల గడువు జూన్ 2న, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ గడువు జూన్ 16న, ఒడిశా అసెంబ్లీ గడువు జూన్ 24న ముగియనున్నాయి.

బీఎస్పీకి రాజీనామా.. బీఆర్ఎస్ లోకి ప్రవీణ్ కుమార్

(మొదటి పేజి తరువాయి)

ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ, పరిస్థితులకు అనుగుణంగా కొత్త దారిని వెతుక్కోవాల్సి వచ్చిందని తెలిపారు. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తో బీఎస్పీ పొత్తు పెట్టుకున్న సంగతి తెలిసిందే. ఇది జరిగి రోజు కూడా గడవకుండానే ఆయన బీఎస్పీకి రాజీనామా చేయడం గమనార్హం. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున నాగర్ కర్నూల్ నుంచి ప్రవీణ్ పోటీ చేయనున్నారు. బీఎస్పీని వీడాలనే నిర్ణయాన్ని ఎంతో బాధతో తీసుకున్నానని ప్రవీణ్ ఎక్స్ వేదికగా తెలిపారు. తెలంగాణలో తన నాయకత్వంలో తీసుకున్న నిర్ణయాల కారణంగా ఎంతో గొప్పదైన బీఎస్పీ ఇబ్బంది పడకూడదనేది తన భావన అని చెప్పారు. పొత్తులో భాగంగా ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ముందుకు సాగాల్సిందేనని... కష్టసుఖాలను పంచుకోవాల్సిందేనని చెప్పారు. తాను నమ్మిన నిజమైన ధర్మం ఇదేనని అన్నారు.

నిన్న బీఎస్పీ - బీఆర్ఎస్ పొత్తు వార్త బయటకు వచ్చిన వెంటనే ఈ చారిత్రాత్మక పొత్తును భగ్నం చేయాలని బీజేపీ విశ్వప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. కవిత అరెస్ట్ కూడా ఇందులో భాగమేనని చెప్పారు. బీజేపీ కుట్రలకు భయపడి తాను నమ్ముకున్న విలువలకు తిలోదకాలను ఇవ్వలేనని... తన ఈ ప్రస్థానాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. తనపై నమ్మకం ఉంచి అవకాశం ఇచ్చిన పార్టీ అధ్యక్షురాలు మాయావతికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ప్రవీణ్ చెప్పారు. చివరి వరకు బహుజనవాదాన్ని తన గుండెల్లో పదిలంగా దాచుకుంటానని తెలిపారు. బహుజనుల అభివృద్ధి కోసం అలుపెరుగని కృషి చేస్తానని చెప్పారు

ప్రచారంలో హద్దుమీరవొద్దు..

రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం హెచ్చరిక

మార్చి16(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికలు, ఆంధ్రప్రదేశ్ సహా 4 నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు హద్దుమీరవద్దని కేంద్ర ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఎన్నికల నియమావళిని విధిగా పాటించాల్సిందేనని వార్నింగ్ ఇచ్చింది. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్ ప్రకటన సందర్భంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ స్పష్టం చేశారు. “ గతంలో చాలాసార్లు నోటీసులు జారీ అయ్యాయి. కానీ చర్యలు అంతగా లేవు. నైతికమైన చర్యలు ఉండేవి. కానీ ఈసారి గట్టి చర్యలు ఉంటాయి. గత చర్యలు, చరిత్రను పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకుంటాం” అని హెచ్చరించారు.మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించి పరిశీలించిన అనంతరం తుది మార్గదర్శకాలను జారీ చేశామని వివరించారు. ఎన్నికల కోడ్ అమలు విషయంలో క్షేత్ర స్థాయిలో సంసిద్ధమయ్యామని, రాజకీయ పార్టీలపై దృష్టి పెట్టామని రాజీవ్ కుమార్ చెప్పారు. పార్టీలోని స్టార్ క్యాంపెయినర్లు అందరికీ ఈసీ మార్గదర్శకాలతో కూడిన కాపీలను అందించాలని ఇప్పటికే సూచించామని ఆయన ప్రస్తావించారు. దేశంలో రాజకీయ పార్టీల మధ్య చర్చలు, వ్యాఖ్యలు దిగజారుతున్నాయని, అన్ని రాజకీయ పార్టీలకు కీలక సలహాలు, సూచనలు చేసినట్టు రాజీవ్ కుమార్ వివరించారు.ఇక ఎన్నికల నియమావళికి సంబంధించిన మార్గదర్శకాలను స్టార్ క్యాంపెయినర్లు, అభ్యర్థుల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలదేనని రాజీవ్ కుమార్ అన్నారు. ఆ విషయాన్ని నోటీసుల ద్వారా పార్టీలకు తెలియజేశామని, ఈ మేరకు షెడ్యూల్ కంటే ముందుగానే అవగాహన కల్పించామని అన్నారు. రాజకీయ వ్యాఖ్యలు, చర్చలు స్ఫూర్తినిచ్చేలా ఉండడానికి పార్టీలకు పలు కీలక సూచలు చేశామని అన్నారు. విద్వేష ప్రసంగాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. కుల, మతపరమైన విన్నపాలు, వ్యక్తిగత విషయాలపై విమర్శలకు దిగకూడదని సూచనలు చేశామన్నారు.

వంద రోజుల పాలన పూర్తి సంతృప్తినిచ్చింది

మార్చి16(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ : ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు ఓ ఎన్నికల స్టంట్ అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లూ టీవీ సీరియల్‌లా సాగదీసి, లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రావడానికి ముందు అరెస్టు చేయడం కాంగ్రెస్‌ను దొంగదెబ్బ తీసే డ్రామాయేనని ఆరోపించారు. అరెస్టు సానుభూతితో బీఆర్ఎస్, అవినీతి వ్యతిరేకుల మని చెప్పుకొంటూ బీజేపీ ఓట్లు దండుకునేందుకు చేస్తున్న ప్రయత్నమిదని విమర్శించారు. కవిత తండ్రిగా, పార్టీ అధ్యక్షుడిగా కేసీఆర్ ఏమీ స్పందించకపోవడం, ప్రధాని మోదీ కూడా మౌనం పాటించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు.

రాష్ట్రంలో వందరోజుల పాలన పూర్తయిన సందర్భంగా సీఎం రేవంత్ తన నివాసంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్, డాక్టర్ రోహిణ్‌రెడ్డి తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. వివరాలు రేవంత్ మాటల్లోనే..

మా పాలనకు రెఫరెండం..

బీఆర్ఎస్, బీజేపీల పదేళ్ల పాలనకు, వందరోజుల మా పాలనకు లోక్‌సభ ఎన్నికలు రెఫరెండం. మేం చేస్తున్న పనులు, అభివృద్ధి కార్యక్రమాలను చూపి ఓట్లు అడుగుతాం..”అని రేవంత్‌రెడ్డి చెప్పారు. టానిక్ మద్యం వ్యాపారంలో తీగలాగుతున్నామని.. దొరలు, పెద్దలంతా బయటకు వస్తారని, వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో వందరోజుల పాలన పూర్తి సంతృప్తినిచ్చింది. ‘మార్పు కావాలి-కాంగ్రెస్ రావాలి’నినాదం, 6 గ్యారంటీలను చూసి ప్రజలు మమ్మల్ని గెలిపించారు. ఆ మార్పు మారుమూల ప్రాంతాలకు కూడా వెళ్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం వందేళ్లకు సరిపడా విధ్వంసం చేస్తే.. దానిని చక్కదిద్దేందుకు రోజుకు 18 గంటలు కష్టపడుతున్నాం. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎలాంటి హంగూ ఆర్భాటాలకు వెళ్లకుండా ప్రజలతో మమేకమై సమస్యలను పరిష్కరిస్తున్నారు. సీఎం దర్శన భాగ్యమే కలగని రోజుల నుంచి సీఎం, మంత్రులంతా ప్రజల్లోనే ఉండే మార్పు వచ్చింది.

విజ్ఞులు, మేధావులు, కళాకారులతో కలసి, వారి ఆలోచనలను తెలుసుకుంటూ పాలన సాగిస్తున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఇప్పటివరకు 26 కోట్ల ప్రయాణాలు జరిగాయి. ఆరోగ్యశ్రీ పరిమితి పెంచాం. రూ.500 సిలిండర్‌ను 8 లక్షల మంది వినియోగించుకున్నారు. 37 లక్షల ఇళ్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించాం. పారదర్శక పాలన అందిస్తున్నాం. మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలిచ్చాం. కేంద్రంతో సత్సంబంధాలు నెరుపుతూ పెండింగ్ పథకాలకు అనుమతులు తెచ్చుకుంటున్నాం. పొరుగు రాష్ట్రాలతో గిల్లికజ్జాలు పెట్టుకోదలుచుకోలేదు. హైదరాబాద్ నగరాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తాం.

సీఏఏ అమలును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఒవైసీ

సీఏఏ అమలుపై స్టే ఇవ్వాలంటూ సుప్రీంకోర్టులో ఒవైసీ పిటిషన్

ముస్లింల ఉనికే ప్రశ్నార్థకమవుతుందని వెల్లడి

మార్చి16(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ : పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల నుంచి 2014 డిసెంబరు 31కి ముందు భారత్ లో ప్రవేశించిన హిందూ, సిక్కు, క్రైస్తవ, జైన, పార్సీ వర్గాల ప్రజలకు భారత పౌరసత్వాన్ని అందించే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలును నిలిపివేయాలంటూ మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సీఏఏ అమలు కొనసాగకుండా స్టే ఇవ్వాలంటూ ఒవైసీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీఏఏని ఎన్పీఆర్ (నేషనల్ పాప్యులేషన్ రిజిస్టర్), ఎన్ఆర్ సీ (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్)తో కలిపి చూడాలని పేర్కొన్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల నుంచి భారత్ కు వలస వచ్చే హిందువులు, సిక్కులకు పౌరసత్వం ఇవ్వడానికి తానేమీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. కానీ, భవిష్యత్తులో మీరు ఎన్పీఆర్, ఎన్ఆర్ సీ తీసుకువస్తే 17 కోట్ల మంది ముస్లింల ఉనికి ప్రశ్నార్థకమవుతుందని అన్నారు. వారికి ఓ సొంత దేశం అంటూ లేకుండా చేయాలనుకుంటున్నారు అని మండిపడ్డారు.హైదరాబాద్ ప్రజలు ఎన్నికల్లో సీఏఏకి వ్యతిరేకంగా ఓటు వేసి బీజేపీని ఓడిస్తారని ఒవైసీ పేర్కొన్నారు. ఓ ప్రాంతం ఆధారంగా చట్టాలు చేయలేరని, దీనికి సంబంధించి సుప్రీంకోర్టు గతంలో అనేక తీర్పులు ఇచ్చిందని అన్నారు.

కవిత అరెస్టుకు తెలంగాణ ప్రజలకు ఏం సంబంధం : మంత్రి కోమటిరెడ్డి

మార్చి16(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ : కవిత అరెస్ట్‌కు నిరసనగా తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్? పార్టీ ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ నిరసన పై మంత్రి కోమటిరెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీ లిక్కర్ కేసుకు, తెలంగాణ ప్రజలకు ఏం సంబంధం అని ప్రశ్నించారు.కవితను అరెస్ట్ చేసింది ఢిల్లీ పోలీసులైతే.. తెలంగాణలో ధర్నాలు చేసి ప్రజల్ని ఇబ్బంది పెట్టడం ఎందుకని మండిపడ్డారు. నాడు చంద్రబాబు అరెస్టు సందర్భంగా జరిగిన ధర్నాలను, ర్యాలీలను అడ్డుకున్న వ్యక్తులే ఇవాళ ధర్నాలకు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన విషయాలకు హైదరాబాద్‌లో ధర్నలెందుకని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులు.. ఢిల్లీకి చెందిన ఈడీ అధికారులు అరెస్టు చేస్తే తెలంగాణలో ధర్నాలకు ఎందుకు పిలుపునిస్తున్నారని అడిగారు.ప్రాజెక్టుల నిర్మాణంలో అక్రమంగా సంపాదించిన డబ్బుతో స్పెషల్ ఫ్లైట్లు బుక్ చేసి బీఆర్ఎస్ కార్యకర్తలను ఢిల్లీకి తీసుకపోయి ఈడీ ఆఫీసు ముందు ధర్నాలు దీక్షలు చేసుకోండి అని హితవు పలికారు. ‘ఎవడొస్తడో రా చూసుకుందాం అని తొడకొట్టి.. ఇప్పుడు అమాయక కార్యకర్తలను రోడ్లమీదకి తేవడం ఎందుకు’ అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పాలనతో ప్రజల జీవితాల్లో ఇప్పుడిప్పుడే వెలుగులు నిండుతున్నాయని.. మళ్లీ మీ కుటిల రాజకీయాలతో తెలంగాణ ప్రజల్ని ఇబ్బందులు పెట్టకండని అన్నారు. ఏపీ ముఖ్యమంత్రితో కుమ్మక్కై రాయలసీమకు నీళ్లివ్వడం మూలంగా ఇవాళ తెలంగాణ ప్రాజెక్టులన్నీ అడుగంటిపోయాయని తెలిపారు. రైతులు కరువుతో అల్లాడితోపోతుంటే.. మీ లిక్కర్ రాజకీయాలకు రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చాలనుకుంటున్నారా..? అని ఘాటుగా కోమటిరెడ్డి

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: కేఆర్

వర్ధన్నపేట, మార్చి16(జర్నలిస్ట్ వార్త):
వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల పురోగతిపై ముందుకు పోతున్నానని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం వర్ధన్నపేట మండల పరిధిలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. నల్లబెల్లి, చెన్నారం, ఇల్లంద, రామవరం, వర్ధన్నపేట గ్రామాల్లో సిసి రోడ్డు పనులు, బోర్లు, సైన్స్ ల్యాబ్ ప్రారంభించి అనంతరం వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గం లోని గ్రామీణ ప్రాంతాలవారీగా తాను పర్యటిస్తున్నానని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజలు భూ సమస్యలపై విజ్ఞప్తి చేస్తున్నారు. వెబ్సైట్ కారణంగా భూ సమస్యలు పెరిగిపోయాయని వివరించారు. ఏది ఏమైనా తనకు అవకాశాన్ని కల్పించి, సమస్యల పట్ల కొట్టుమిట్టాడుతున్న వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎలాంటి సమస్య వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆదుకోవడం తమ వంతు బాధ్యత అని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కోసం తమకు వస్తున్న నెలసరి వేతనంలో 50 శాతం పలు అభివృద్ధి పనులకు ఖర్చుపెడుతున్నానని చెప్పారు. ఎంపీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ విడుదల చేస్తున్న కారణంగా అభివృద్ధి పనులు నిలిపివేయరాదని ముందస్తుగా ప్రారంభోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. సొంత పార్టీలో పనిచేస్తూ తమ జీవితాన్ని కోల్పోయిన కార్యకర్తలు ఎలాంటి సందేహబడాల్సిన అవసరం లేదన్నారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరు కాంగ్రెస్ విజయానికి చేదోడుగా నిలిచారని చెప్పుకొచ్చారు. నియోజకవర్గ పరిధిలోని నిరుపేద విద్యార్థుల కోసం ఉచిత కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిపుణులైన ఉపాధ్యాయులచే కోచింగ్ ఇప్పించనున్నట్లు తెలిపారు. తమ కర్తవ్యమల్లా విద్యాభివృద్ధి పై ప్రాధాన్యత నివ్వడమే అని చెప్పారు. విద్యుత్ కారణంగా పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. మీటర్లు ఏర్పాటు చేసుకోవాలంటే నియోజకవర్గ ప్రజలు ఎందుకు వినడం లేదో తెలియడం లేదన్నారు. మీటర్లు పెట్టుకోవడం కారణంగా విద్యుత్ శాఖతో ఎవరైనా మృతి చెందితే వారికి ఎక్స్రేషియా 5 లక్షల రూపాయలు వర్తిస్తాయన్న సంగతి వారు అవగాహన చేసుకోవాలన్నారు. ప్రభుత్వం200 యూనిట్లు ఫ్రీగా ఇచ్చినప్పటికీ ఖర్చులు ఎక్కువ అయ్యే పరిస్థితి ఉండబోదని గుర్తు చేశారు. తద్వారా మీటర్లు పెట్టుకోవడం ప్రజలకు మేలు జరుగుతుందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు ఇచ్చిన ప్రతి హామీ త్వరితగతిన నిర్వర్తిస్తూ పరిపాలన సాగుతుందన్నారు. ప్రభుత్వం కల్పించే ప్రతి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బిసి సంక్షేమశాఖలో 37 కార్పొరేషన్లకు చైర్మన్లు

మార్చి16(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ :
రాష్ట్ర ప్రభుత్వం 37కార్పొరేషన్‌లకు చైర్మన్‌లను నియమించింది. ఇందుకు సంబంధించి ఈనెల 14న ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే చాలా మంది ఆశావహులు నామినేటేడ్ పదవులకు దరఖాస్తు చేసుకున్నారు. పార్టీలో చురుగ్గా పని చేసి సేవలందించిన వారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పదవులకు నామినేట్ చేశారు. పటేల్ రమేష్ రెడ్డి (చైర్మన్,పర్యాటకాభివృద్ధి సంస్థ), కె. శివసే నా రెడ్డి (స్పోర్ట్ అథారిటీ), ఎన్.ప్రీతం (ఎస్సి కార్పొరేషన్), నూతి శ్రీకాంత్ (బిసి కార్పొరేషన్), ఎస్. అన్వేష్ రెడ్డి (విత్తనాభివృద్ధి సంస్థ), ఎరావత్ అనిల్ (మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్), ఎం.విజయబాబు(కోఆపరేటివ్ హౌసిం గ్ ఫెడరేషన్), రాయల నాగేశ్వర రావు(గిడ్డంగుల సంస్థ), కాసుల బాలరాజు (ఆగ్రో ఇండస్ట్రీస్), నేరెళ్ళ శారద (మహిళా కమిషన్), బం డారు శోభారాణి (ఉమెన్ కొ ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్), సిహెచ్ జగదీశ్వర్ రావు (ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్), జంగా రాఘవ రెడ్డి (ఆయిల్ సీడ్స్ ఫెడరేషన్), మనాల మోహన్ రెడ్డి (కొ ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్), బెల్లయ్య నాయక్ (గిరిజన కొ ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్), గురునాథ్ రెడ్డి (పోలీస్ హౌసింగ్), జ్ఞానేశ్వర్ ముదిరాజ్ (డైరీ డెవలప్‌మెంట్), చెల్లా నర్సింహారెడ్డి (అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), మెట్టు సాయికుమార్ (ఫిషరీస్ ఫెడరేషన్), కొత్తాకు నాగు (ఎస్‌టి కొ ఆపరేటివ్ ఫైనాన్స్), జనక్ ప్రసాద్ (కనీస వేతన సలహా మండలి), ఎండి రియాజ్ (గ్రంథాలయ పరిషత్), ఎం. వీరయ్య (వికలాంగుల కార్పొరేషన్), నాయుడు సత్యనారాయణ(హ్యాండీక్రాఫ్ట్), ఎం.ఎ జబ్బార్ (మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్), టి. నిమ్మల జగ్గారెడ్డి (టిజిఐఐసి), రాంరెడ్డి మల్‌రెడ్డి (రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్), కాల్వ సుజాత (వైశ్య కార్పొరేషన్), పోడెం వీరయ్య(ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్), ఐతా ప్రకాశ్ రెడ్డి (ట్రేడ్, ప్రమోషన్), కె. నరేందర్ రెడ్డి (శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ), అలేఖ్య పుంజాల (సంగీత్, నాటక్ అకాడమి), ఎన్. గిరిధర్ రెడ్డి (ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్), మన్నె సతీష్ కుమార్ (టెక్నాలజీ సర్వీసెస్), జరిపేటి జైపాల్ (ఎంబిసి డెవలప్‌మెంట్ కార్పొరేషన్), ఇ. వెంకట్ రామిరెడ్డి (కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ), ఎం.ఎ. ఫహీం (తెలంగాణ ఫుడ్స్) లను నియమించారు.

కవిత అరెస్టుపై.. రాష్ట్రవ్యాప్తంగా నిరసన

అక్రమ అరెస్టును తీవ్రంగా
ఖండిస్తున్నాము

మార్చి16(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ :
ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత అక్రమ అరెస్టుపై బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు కన్నెర్ర చేశారు. కవిత అరెస్టుకు నిరసనగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఆందోళనలు నిర్వహించారు. బస్సు డిపోల ముందు బిఆర్ఎస్ కార్యకర్తలు బైఠాయించారు. మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. వెయ్యి మంది మోదీలు, రేవంత్‌లు వచ్చినా భయపడేది లేదని స్పష్టం చేశారు. ఎలాంటి మచ్చలేకుండా ఎంఎల్‌సి కవిత బయటకు వస్తారని గులాబీ పార్టీ నాయకులు, కార్యకర్తలు విశ్వాసం వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లాలో బోధన్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో బిఆర్ఎస్ నేతలు రోడ్లపై బైఠాయించారు. ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. నిజామాబాద్ పట్టణంలో జెడ్‌పి చైర్మన్ విఠల్ రావు ధర్నాలో పాల్గొన్నారు. సిద్దిపేట పాత బస్టాంట్ చౌరస్తాలో బిఆర్ఎస్ కార్యకర్తలు ధర్నా చేశారు. అక్రమ అరెస్టులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలో పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు.

కరీంనగర్ జిల్లాలోని గంగాధర మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంఎల్‌ఎ సుంకె రవిశంకర్, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో పార్టీ నేతలు, కార్యకర్తలు నిరసన కార్యకర్తలు చేపట్టారు. కవిత అరెస్టుకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మీర్‌పేటలో బిఆర్ఎస్ కార్యకర్తలు ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేసి .. మోదీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. బోరబండ బస్టాండ్ వద్ద ఎంఎల్‌ఎ మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిరసనలతో హోరెత్తించారు. ఇల్లందు పట్టణంలో బిఆర్ఎస్ కార్యకర్తలు నిరసన ర్యాలీ చేపట్టారు. కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. అశ్వారావుపేట రింగురోడ్డు సెంటర్‌లో పార్టీ నాయకులు ధర్నా చేశారు. ఎంఎల్‌సి కవిత అరెస్ట్‌కు నిరసనగా స్టేషన్ ఘన్‌పూర్ మండల కేంద్రంలో ఎంఎల్‌ఎ కడియం శ్రీహరి నేతృత్వంలో పార్టీ శ్రేణులు జాతీయ రహదారిపై భైఠాయించి ధర్నా నిర్వహించారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ ముమ్మాటికి రాజకీయ కుట్రే

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

వర్ధన్నపేట, మార్చి16(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై ఎమ్మెల్సీ కవిత అరెస్టు నిరసిస్తూ శనివారం టిఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరై ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ పై విమర్శ చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని దెబ్బతీసేందుకే పీఎం మోడీ, తెలంగాణ సీఎం రేవంత్ ఎత్తుగడే ఈడి అరెస్టని బీఆర్ఎస్ నాయకులు అంటున్నారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టులో ప్రధాని మోడీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర చేశారని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి అవుతున్నా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కెసిఆర్ ఇచ్చిన విద్యుత్, నీళ్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, రైతుబంధు, రైతు భీమా తప్ప కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని తీవ్ర విమర్శలు చేశారు. అధికారం కోసం తమ పార్టీని వీడి పక్క పార్టీలకు నాయకులు వెళ్తున్నారని అన్నారు. కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దనున్నట్లు ఎర్రబెల్లి అన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారికే ప్రజల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో బరాస అత్యధిక సీట్లతో విజయకేతనం ఎగరవేనున్నట్లు ఎర్రబెల్లి ఆశా భావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న దేవాలయ అధికారులపై ఫిర్యాదు

వర్ధన్నపేట, మార్చి16(జర్నలిస్ట్ వార్త): ఐనవోలు మల్లన్న దేవాలయ అధికారులపై శనివారం బిఎస్పీ పార్టీ నేత చింత సామేల్ పిర్యాదు చేశారు. ఇట్టి విషయం వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతుంది. ఈ సందర్భంగా ఎండోమెంట్ కమిషనర్ అనిల్ కుమార్ ను కలిసి ఆయన ఫిర్యాదు చేశారు. ఇన్చార్జి ఈఓ, అకౌంటెంట్ అధికారులు సంవత్సరాల తరబడి అదే దేవాలయంలో ఎలా పనిచేస్తారని పిర్యాదు ద్వారా ప్రశ్నించారు. దేవాలయ అభివృద్ధి, వివిధ కార్యక్రమాల ద్వారా అనేక ఖర్చులతో లెక్కలు చూపిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు విచారణ చేపట్టాలని కోరారు.

లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

- అందజేసిన ఎంపీపీ మార్నేని మధుమతి

వర్ధన్నపేట, మార్చి16(జర్నలిస్ట్ వార్త): ఐనవోలు మండల పరిధిలోని లబ్ధిదారులకు శనివారం కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మార్వో విక్రమ్ కుమార్ అధ్యక్షతన చేపట్టిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎంపీపీ మార్నేని మధుమతి రవీందర్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం మండల పరిధిలోని 96 మంది లబ్ధిదారులకు వారి చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, స్థానిక నేతలు, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ మల్లయ్య, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భారాసకు అరూరి రమేశ్ రాజీనామా

వర్ధన్నపేట, మార్చి16 (జర్నలిస్ట్ వార్త):
భారాసకు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ రాజీనామా చేశారు. వరంగల్ జిల్లా భారాస అధ్యక్ష పదవి, సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన లేఖ విడుదల చేశారు.

ఇటీవల పార్టీని వీడేందుకు అరూరి సిద్ధం కాగా పలు నాటకీయ పరిణామాలతో ఆయన నిర్ణయం వాయిదా పడిన విషయం తెలిసిందే.

ముగిసిన బండి సంజయ్ ప్రజాహిత యాత్ర

మార్చి16(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ : బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి బండి సంజయ్ కుమార్ చేపట్టిన ప్రజాహిత యాత్ర ముగిసింది. ప్రజాహిత యాత్ర చివరి రోజైన శనివారం నాడు తిమ్మాపూర్, బెజ్జంకి మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. బెజ్జంకి మండలంలో 5, తిమ్మాపూర్ మండలంలో 3 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బెజ్జంకి మండలంలోని గుండారం, బేగంపేట, లక్ష్మీపూర్ గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్ల కంపౌండ్ వాల్ నిర్మాణానికి, బెజ్జంకిలో యాదవ కమ్యూనిటీ హాలు, దాచారంలో కామన్ వర్క్ షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అట్లాగే తిమ్మాపూర్ మండంలోని రేణిగుంటలో యాదవ కమ్యూనిటీ హాలు ప్రహరిగోడ, మహాత్మానగర్, కొత్తపల్లి గ్రామాల్లో కమ్యూనిటీ హాలు, రాఘవాపూర్ లో బోర్ వెల్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు%ళా% ఎన్నికల షెడ్యూల్ వెలువడటానికి కొద్ది నిమిషాల ముందే ఆయా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతోపాటు ప్రజాహిత యాత్రను ముగించారు.

ఈ రోజు బండి సంజయ్ కుమార్ ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లో పలు శంకుస్థాపనలు చేశారు. పార్టీ నేతల కోసం బెజ్జంకి, తిమ్మాపూర్ తొలిదశలో సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 15 మండలాలు (2 మున్సిపాలిటీలు)లతోపాటు మొత్తం 81 గ్రామాల్లో 215 కి.మీల మేరకు ప్రజాహిత యాత్ర సాగింది. జగిత్యాల జిల్లాకు సంబంధించి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే మండలాల్లోనూ ప్రజాహిత యాత్రను పూర్తి చేశారు. ప్రతి గ్రామంలో, మండల కేంద్రాల్లో, మున్సిపాలిటీల్లో బండి సంజయ్ పాదయాత్ర చేసి ప్రజలతో మమేకమయ్యారు. కేంద్ర ప్రభుత్వం ఆయా గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాకు చేసిన అభివృద్ధిని

వెచ్చించిన నిధులను పూర్తి వివరాలతో సహా ప్రజలకు వివరించారు. ఆయా గ్రామాల్లోనూ వీటికి సంబంధించి నిధుల వివరాలతో పోస్టర్లను అంటించారు. మలిదశ యాత్రలో భాగంగా హుస్నాబాద్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 29 మండలాల్లోని 131 గ్రామాల్లో బండి సంజయ్ యాత్ర కొనసాగింది. మొత్తం 538 కిలోమీటర్ల మేరకు యాత్ర చేశారు. సిద్దిపేట, హన్మకొండ జిల్లాలకు సంబంధించి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే మండలాల్లోనూ ప్రజాహిత యాత్రను పూర్తి చేశారు. తొలి, మలి విడత కలిపి మొత్తం 44 మండలాల్లోని 211 గ్రామాల్లో 753 కి.మీల మేరకు యాత్ర కొనసాగింది.

మొత్తంగా ప్రజాహిత యాత్రకు ప్రజల నుండి మంచి స్పందన లభించింది. ఏ గ్రామానికి వెళ్లినా స్థానికులు తరలివచ్చి స్వాగతం పలికారు. ప్రజాహిత యాత్ర ఆద్యంతం కాషాయ సైన్యంలో జోష్ నింపింది. బండి సంజయ్ అడుగులో అడుగు వేస్తూ పార్టీ శ్రేణులు వెంట కదిలాయి. యాత్రలో భాగంగా బండి సంజయ్ గ్రామగ్రామాన తిరుగుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం గ్రామాల వారీగా వెచ్చించిన నిధులను లెక్కలతో సహా ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలియజేశారు. ప్రజల కష్టాలను స్వయంగా అడిగితెలుసుకున్నారు. వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను వినతి పత్రం ద్వారా సంజయ్‌కు తెలియజేశారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని..మరోసారి ఎంపిగా తనను గెలిపించాలని సంజయ్ అభ్యర్థించారు. పువ్వుకు ఓటేస్తే రాముడికి వేసినట్లే..500 ఏళ్ల నాటి కల నెరవేర్చిన మోదీని మళ్లీ ప్రధానిని చేద్దామని సంజయ్ పిలుపునిచ్చారు.ఇక రాజకీయ అంశాల విషయానికొస్తే ప్రజాహిత యాత్రలో భాగంగా సంజయ్.. కాంగ్రెస్ , బిఆర్ఎస్ పార్టీలపై నిప్పులు చెరిగారు. తొలివిడత యాత్రలో కాళేశ్వరం, క్రిష్ణా నీటి వాటాల విషయంలో రెండు పార్టీలు డ్రామాలాడుతున్నాయని అడుగడుగునా ఎండగట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిన కెసిఆర్ సహా బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయలేదని, వారి ఆస్తులను ఎందుకు జప్తు చేయలేదో అడుగడుగునా నిలదీశారు. బిఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ వైఫల్యాలను సైతం పదేపదే ఎండగట్టారు. మలి విడత యాత్రలో 6 గ్యారంటీల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను అడుగడుగునా ఎండగట్టారు. వంద రోజుల గడువు ముగిసినందున 6 గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలంటూ పిలుపునిచ్చారు.

ఒలింపిక్స్‌కు రాంబాబు అర్హత

దిల్లీ: భారత నడక అథ్లెట్ రాంబాబు సత్తాచాటాడు. ఈ ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. స్లొవేకియాలో జరిగిన డుండిన్‌స్కా 50 మీట్ పోటీల్లో 20 కిలోమీటర్ల నడకలో అతను మూడో స్థానంలో నిలిచాడు.గంటా 20 నిమిషాల్లో రేసు పూర్తి చేసిన రాంబాబు.. ఒలింపిక్స్ అర్హత (గంటా 20 నిమిషాల 10 సెకన్లు) ప్రమాణాన్ని అందుకున్నాడు. నడక విభాగంలో పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణం అందుకున్న భారత ఏడో పురుష అథ్లెట్ రాంబాబు. కానీ వ్యక్తిగత ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో ఒక దేశం నుంచి ముగ్గురు అథ్లెట్లను మాత్రమే ఒలింపిక్స్‌కు పంపాల్సి ఉంటుంది.

ఆకాశ్‌దీప్, సూరజ్, సెర్విన్, అర్ష్‌ప్రీత్, పరమ్‌జీత్, వికాస్, రాంబాబులో ముగ్గురిని ఎంపిక చేయడం కోసం భారత అథ్లెటిక్స్ సమాఖ్య జూన్‌లో సెలక్షన్స్ నిర్వహించనుంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 24 ఏళ్ల రాంబాబు.. నిరుడు ఆసియా క్రీడల 35 కిలోమీటర్ల నడకలో కాంస్యం నెగ్గాడు. పేద కుటుంబం నుంచి వచ్చిన అతను..

తన అథ్లెటిక్స్ శిక్షణ కోసం వెయిటర్‌గానూ పనిచేశాడు. తండ్రితో కలిసి ఉపాధి హామీ పనికి కూలీగా వెళ్లాడు. ఆరంభంలో అతను మారథాన్‌లో పరుగెత్తేవాడు. కానీ మోకాలి నొప్పి కారణంగా స్థానిక కోచ్ సలహాతో నడక విభాగంలోకి మారాడు.ం

సెమీస్‌లో లక్ష్యసేన్ ఓటమి



బర్మింగ్‌హమ్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఈ సారీ పతకం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. పురుషుల ఈవెంట్‌లో ఏకైక ఆశాకిరణం లక్ష్యసేన్‌కు సెమీస్‌లో చుక్కెదురైంది.దీంతో ప్రతిష్టాత్మక టోర్నీలో భారత పోరాటం ముగిసింది. 2022 టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచిన 22 ఏళ్ల లక్ష్యసేన్‌పై ఈ సారి భారత బృందం గంపెడాశలు పెట్టుకుంది. అయితే శనివారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌తో ఆ ఆశలన్నీ ఆవిరయ్యాయి.

పురుషుల సింగిల్స్‌లో జరిగిన సెమీస్‌లో భారత ఆటగాడు 12-21, 21-10, 15-21తో జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా) చేతిలో పోరాడి ఓడాడు. ఒక గంటా 8 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌లో ప్రత్యర్థి జోరుకు ఎదురు నిలువలేకపోయిన లక్ష్యసేన్ రెండో గేమ్‌లో పుంజుకోవడంతో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ క్రిస్టీకి కష్టాలు తప్పలేదు.

ఈ గేమ్‌ను కైవసం చేసుకున్న భారత షట్లర్ నిర్ణాయక మూడో గేమ్‌లో ఆ పట్టుదల కొనసాగించడంలో విఫలమయ్యాడు. ఫలితం నిరాశపరిచినప్పటికీ వరుసగా ఫ్రెంచ్ ఓపెన్, ఆల్ ఇంగ్లండ్ టోర్నమెంట్లలో సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించడం ద్వారా లక్ష్యసేన్ బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్ ద్వారా ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశాల్ని మెరుగుపర్చుకున్నాడు.

ఇక గీత దాటితే వేటే

నేటి నుంచే ఎన్నికల కోడ్ %అమలులోకి వచ్చిన ప్రవర్తనా నియమావళి

ఎన్నికల కమిషన్ పరిధిలోకి ప్రభుత్వ ఉద్యోగులు కొత్త స్కీమ్‌లు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు బంద్

ప్రభుత్వంలో ఉన్ననేతలకు గవర్నమెంట్ వెహికల్స్ కట్ రాత్రి 10 గంటల నుంచి.. ఉదయం 6 గంటల వరకు మైకులు మూగనోము

ఆలయాలు, ప్రార్ధనామందిరాలు, మసీదులలో ప్రచారం నిషేధం నగదు పంచినా, తీసుకున్నా నేరమే

ఓటర్లు కూడా కోడ్ పరిధిలోకి వస్తారన్న ఎన్నికల కమిషన్

మార్చి16(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల షెడ్యూలును శనివారం ఎన్నికల కమిషన్ వెల్లడించింది. దీంతో పాటు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తేదీలను కూడా ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. ఈసీ ప్రకటన వెలువడిన మరుక్షణం నుంచే దేశవ్యాప్తంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చింది. ఈ ప్రవర్తనా నియమావళి ఏమిటి, దాన్ని ఎవరు అమలు చేస్తారు.. అమలు తర్వాత ఏ విషయాలు నిషేధాజ్ఞలు ఉంటాయో చదివి తెలుసుకుందాం.

దేశంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ కొన్ని నిబంధనలను రూపొందించింది. ఈ నియమాలను ప్రవర్తనా నియమావళి అంటారు. లోక్‌సభ లేదా అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఈ నిబంధనలను పాటించడం తప్పనిసరి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఏం చేయాలో, ఏం చేయకూడదో ఇందులో పొందుపరిచారు

1960లో తొలిసారి కోడ్ అమలు

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం.. ఎన్నికల కమిషన్ రాజకీయ పార్టీలను శాంతియుత ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించాలని ఆదేశిస్తుంది. ప్రవర్తనా నియమావళిని తొలిసారిగా 1960లో కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రవేశపెట్టారు. 1962 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ తొలిసారిగా రాజకీయ పార్టీలకు ఈ నిబంధనలను వర్తింపజేసంది. ఇక ఈ ప్రవర్తనా నియమావళి విధానం 1967 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నుండి అమలులోకి వచ్చింది.

ఎన్నికల కమిషన్ పరిధిలో ఉద్యోగులు

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రక్రియ



चनाव
RAJIV KUMAR
CHIEF ELECTION COMMISSIONER

పూర్తయ్యే వరకు ప్రభుత్వ ఉద్యోగులుగా కాకుండా ఎన్నికల కమిషన్ ఉద్యోగులుగా పనిచేయాలి. ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రవర్తనా నియమావళిని ఎత్తివేస్తారు. ప్రభుత్వం నుంచి, ప్రభుత్వం సంస్థల నుంచి, కార్పొరేషన్ ల నుంచి జీతాలు స్వీకరించే ఏ ఉద్యోగి అయినా ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదు. అలాగే ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పూర్తిగా రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉండాలి. ఎన్నికల కోడ్ ఎత్తివేసేంత వరకూ ఈ ఆంక్షలు కొనసాగుతాయి.

ఆంక్షలు , నిషేధాలు

ప్రభుత్వ ఖర్చుతో మంత్రులు ఎన్నికల ర్యాలీలు నిర్వహించ కూడదు. ఈ సమయంలో మంత్రులు కూడా తమ నివాసం నుంచి కార్యాలయానికి వెళ్లేందుకు మాత్రమే ప్రభుత్వ వాహనాలను వినియోగించుకోవచ్చు. ఎన్నికల ర్యాలీలు, పర్యటనలకు ఉపయోగించరాదు.

ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత.. ఏ రాజకీయ పార్టీకి ప్రయోజనం కలిగించే ఏ కార్యక్రమంలోనైనా ప్రజా ధనాన్ని ఉపయోగించకూడదు. ప్రభుత్వ ప్రకటనలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు వంటి అన్నిరకాల కార్యక్రమాలు ఆగిపోతాయి. అయితే.. కొన్ని పనులు ఇప్పటికే ప్రారంభించి ఉంటే, వాటిని కొనసాగించవచ్చు. అది కూడా ఎన్నికల కమిషన్ ఆదేశాలతో మాత్రమే చేయాల్సి ఉంటుంది.

దేవాలయం, మసీదు, చర్చి, గురుద్వారా లేదా ఏదైనా మతపరమైన స్థలాన్ని ఎన్నికల ప్రచారానికి ఉపయోగించకూడదు.

ప్రవర్తనా నియమావళి ప్రకారం, ప్రభుత్వం ఏ ప్రభుత్వ అధికారిని, ఉద్యోగిని బదిలీ చేయడం, పోస్టింగ్ ఇవ్వడం చేయరాదు. బదిలీ చాలా ముఖ్యమైనవి అయితే.. ఎన్నికల సంఘం నుండి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

మీటింగ్ నిర్వహించడం, ఊరేగింపు నిర్వహించడం, పబ్లిక్ లేదా ప్రైవేట్ ప్రదేశంలో లౌడ్ స్పీకర్లను ఉపయోగించే ముందు స్థానిక పోలీసు అధికారుల నుండి రాతపూర్వక అనుమతి పొందడం అవసరం. రాత్రి 10.00 నుంచి ఉదయం 6.00 గంటల మధ్య లౌడ్ స్పీకర్లను ఉపయోగించరాదు.

ఉల్లంఘిస్తే ఏమవుతుంది

ఏదైనా రాజకీయ పార్టీ లేదా దాని అభ్యర్థి ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే, అప్పుడు ప్రచారం చేయకుండా నిషేధించవచ్చు. అభ్యర్థి ఎన్నికల్లో పోటీ చేయకుండా నిరోధించే అధికారం ఈసీకి ఉంటుంది. ఇది మాత్రమే కాదు.. అవసరమైతే అభ్యర్థిపై క్రిమినల్ కేసు కూడా దాఖలు చేయవచ్చు. జైలుకు కూడా వెళ్లే నిబంధన కూడా ఉంది.

టైటిల్ ఫైట్

రాత్రి 7.30 స్పోర్ట్స్-18లో నేడు ఢిల్లీ, బెంగళూరు తుది సమరం

కప్‌పై కన్నేసిన ఇరు జట్లు మహిళల ప్రీమియర్ లీగ్

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో టైటిల్ ఫైట్‌కు వేళయైంది. ఐపీఎల్‌కు ఏమాత్రం తీసిపోకుండా అభిమానులను అలరిస్తున్న అమ్మాయిలు ఆఖరి పోరుకుసై అంటున్నారు. అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు అమీతుమీ తేల్చుకోనున్నాయి. సమిష్టి ప్రదర్శనతో ఢిల్లీ టాప్ లేపితే..పడుతూ లేస్తూ సాగిన బెంగళూరు..ముంబైని పడగొట్టి ఫైనల్ చేరింది. లీగ్‌లో తొలిసారి టైటిల్‌ను ముద్దాడాలని చూస్తున్న ఇరు జట్ల మధ్య పోరు అభిమానులకు పసందైన విందు అందించడం ఖాయంగా కనిపిస్తున్నది.



న్యూఢిల్లీ: డబ్ల్యూపీఎల్‌లో విజేత ఎవరో మరికొన్ని గంటల్లో తేలనుంది. గత 20 రోజులుగా అభిమానులను అలరిస్తూ వస్తున్న డబ్ల్యూపీఎల్‌లో ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ), రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) మధ్య ఫైనల్ పోరు జరుగనుంది. లీగ్‌లో ఆది నుంచి తమదైన దూకుడు ప్రదర్శిస్తూ ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేసిన ఢిల్లీ..లీగ్ దశలో టాప్ లేపితే..ఆర్‌సీబీ ప్రయాణం పడుతూ లేస్తూ సాగింది. ఎనిమిది మ్యాచ్‌ల్లో ఢిల్లీ రెండింటిలో ఓడితే..ఆర్‌సీబీ నాలుగు గెలిచి, నాలుగింటిలో ఓటమి ఎదుర్కొంది. ఇదిలా ఉంటే ఐపీఎల్‌లో ఇప్పటి వరకు టైటిల్ గెలువని ఢిల్లీ, ఆర్‌సీబీ అమ్మాయిల లీగ్‌లోనైనా తమ కల నెరవేర్చుకోవాలని చూస్తున్నాయి. గత లీగ్‌లో ముంబై చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకున్న ఢిల్లీ ఈసారి సొంతగడ్డపై ఆ ముచ్చట తీర్చుకోవాలని చూస్తుంటే..' ఈ సాలా కప్ నమదే' అంటూ ప్రతీ సీజన్‌లో స్లోగన్ ఎత్తుకునే ఆర్‌సీబీ కొత్త చరిత్ర నాంది పలుకాలని పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో ఎవరు గెలిచినా మొదటిసారే కావడం అభిమానులకు సంతోషాన్ని ఇవ్వనుంది.

ఇస్మార్ట్ బేబీ..నభా నటేష్ కి బ్యాడ్ టైమ్ లో ఓ జాక్ పాట్!

సుధీర్ బాబుకి జోడీగా నన్ను దోచుకుందువటే సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన కన్నడ భామ నభా నటేష్. మొదటి సినిమాతో సక్సెస్ అందుకొని నటిగా కూడా ఈ బ్యూటీ మంచి మార్కులు వేసుకుంది. తరువాత ఇస్మార్ట్ శంకర్ సినిమాలో రామ్ పోతినేనికి జోడీగా మరో బ్లాక్ బస్టర్ ని ఖాతాలో వేసుకుంది. రవితేజకి జోడీగా డిస్కో రాజా మూవీ చేసింది. ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. తేజ్ తో సోలో బ్రతుకే సో బెటరు అంటూ సందడి చేసిన లక్ కలిసిరాలేదు. బెల్లంకొండ శ్రీనివాస్ తో అల్లుడు అదుర్స్ అంటూ గ్లామర్ షో చేసిన సక్సెస్ వరించలేదు. చివరిగా నితిన్ తో మ్యాస్ట్రో సినిమాలో జత కట్టింది. ఆ మూవీ ఫెయిల్ అయ్యింది. 2021లో ఈ సినిమా వచ్చింది. మ్యాస్ట్రో మూవీ తర్వాత నభా నటేష్ రోడ్డు ప్రమాదానికి గురైందంట. దీంతో కొంతకాలం కెమెరా ముందుకి రాలేదు. గాయాల నుంచి కోలుకొని మరల ఏడాది కాలంగా అవకాశాల కోసం ఈ అమ్మడు ప్రయత్నం చేస్తూనే ఉంది. రెగ్యులర్ గా ఇన్ స్టాగ్రామ్ లో గ్లామర్ షో తో దర్శక, నిర్మాతలకి తనని గుర్తు చేస్తోంది. కొన్ని సినిమాలు డిస్కషన్ వరకు వచ్చి ఆగిపోయాయంట. ఇప్పుడు అనూహ్యంగా పాన్ ఇండియా సినిమాలో ఈ అమ్మడు ఛాన్స్ అందుకుంది. కార్తికేయ2తో పాన్ ఇండియా ఇమేజ్ తెచ్చుకున్న యంగ్ హీరో నిఖిల్ పీరియాడికల్ వార్ బ్యాక్ డ్రాప్ లో స్వయంభు అనే మూవీ చేస్తున్నాడు. భారీ బడ్జెట్ తో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో నభా నటేష్ సెకండ్ హీరోయిన్ గా అవకాశం అందుకుందంట. ఇప్పటికే మెయిన్ హీరోయిన్ గా సంయుక్త మీనన్ కన్ఫర్మ్ అయ్యింది. అయితే మూవీలో వారియర్ క్వీన్ తరహా పాత్రలో నభా నటేష్ కనిపించబోతుందంట. ఈ క్యారెక్టర్ కోసం ఆమె యుద్ధ నైపుణ్యాలపై శిక్షణ తీసుకోబోతోందని తెలుస్తోంది. దీంతో పాటుగా ప్రియదర్శితో ఓ కామెడీ ఎంటర్టైనర్ కి నభా నటేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. స్వయంభు మూవీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ కావడంతో సక్సెస్ అయితే మాత్రం ఆమె కెరియర్ మళ్ళీ స్పీడ్ అప్ అయ్యి కమర్షియల్ హీరోయిన్ గా ఎదిగే అవకాశాలు రావొచ్చు. అయితే ఈ అమ్మడు అదృష్టం ఎలా ఉందనేది సినిమా సక్సెస్ మీద ఆధారపడి ఉంటుంది.

అనారోగ్యంపై క్లారిటీ ఇస్తూ బిగ్ బీ వీడియో

బిగ్ బీ అమితాబ్ బచ్చన్ అనారోగ్యం గురించి సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే, ఇవన్నీ ఫేక్ వార్తలేనట.. ఈ విషయాన్ని స్వయంగా బిగ్ బీ యే చెప్పారు. ఈమేరకు థానేలో జరుగుతున్న ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్ చూసేందుకు శనివారం దాదోజి కొండదేవ్ స్టేడియానికి బిగ్ బీ వచ్చారు. అక్కడ తనను పలకరించిన మీడియాతో మాట్లాడుతూ.. తన అనారోగ్యంపై జరుగుతున్న ప్రచారం ఫేక్ అని స్పష్టం చేశారు. పూర్తి ఎనర్జిటిక్ గా కనిపించిన అమితాబ్.. మ్యాచ్ చూసేందుకు తన కొడుకు అభిషేక్ బచ్చన్ తో కలిసి స్టేడియానికి వచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీంతో బిగ్ బి ఫ్యాన్స్ ఆనందంలో మునిగి తేలుతున్నారు.

మార్చి 15న అమితాబ్ అస్వస్థతకు గురయ్యారని, ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో చేరారని ప్రచారం జరిగింది. కాళ్లకు రక్తాన్ని సరఫరా చేసే రక్త నాళాల్లో క్లాట్స్ ఏర్పడ్డాయని, వైద్యులు చికిత్స చేస్తున్నారని వార్తలు వెలువడ్డాయి. అమితాబ్ ఆరోగ్య పరిస్థితి క్షీణించిందని పుకార్లు వెలువడడంతో బిగ్ బీ ఫ్యాన్స్ ఆందోళన చెందారు. తాజాగా తమ అభిమాన నటుడి వివరణ వీడియో చూశాక ఫ్యాన్స్ కుదుటపడ్డారు.

ఫాంటసీ వరల్డ్ కి తీసుకెళ్లనున్న నిత్య..!

సౌత్ హీరోయిన్స్ లో ఎక్కువ శాతం స్కిన్ షో చేయడం ద్వారా గుర్తింపు దక్కించుకున్నారు. చాలా తక్కువ మంది మాత్రమే నటనతో మెప్పించి స్టార్ డమ్ ను దక్కించుకున్నారు. అందులో నిత్యా మీనన్ ఒకరు అనడంలో సందేహం లేదు. కెరీర్ ఆరంభం నుంచి కూడా స్కిన్ షో చేయకుండానే నిత్యా మీనన్ సినిమాలు చేస్తూ వచ్చింది. నటనతో జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ నిత్య మీనన్ కమర్షియల్ పాత్రల కంటే ఎక్కువగా నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు సినిమాలు చేస్తూ వచ్చింది. ఈ మధ్య కాలంలో ఈ అమ్మడి జోరు కాస్త తగ్గిందని చెప్పాలి. తాజాగా ఈ అమ్మడు కొత్త సినిమాకు కమిట్ అయ్యింది. ఫాంటసీ కాన్సెప్ట్ తో రూపొందుతున్న ఈ సినిమాలో నిత్యా మీనన్ ను కొత్తగా చూపించబోతున్నట్లుగా తెలుస్తోంది. ప్రముఖ దర్శకుడు విష్ణువర్ధన్ శిష్యురాలు అయిన కామిని ఈ సినిమాకు దర్శకత్వం వహించబోతుంది. దర్శకురాలిగా కామిని మొదటి ప్రయత్నంలోనే వినూత్న ప్రాజెక్ట్ ను ఎంపిక చేసుకుంది. నిత్యా మీనన్ తో పాటు ఈ ఫాంటసీ సినిమాలో వినయ్ రాయ్, నవదీప్, ప్రతీక్, దీపక్ లు ముఖ్య పాత్రల్లో కనిపించబోతున్నారు. త్వరలో సెట్స్ పైకి వెళ్లబోతున్న ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని విషయాలను త్వరలో వెల్లడించే అవకాశం ఉంది.

విశాల్ డోంట్ వర్రీ రా చిచ్చా.. దేవిశ్రీ మాస్ మ్యాజిక్!

పందెం కోడి, పొగరు వంటి చిత్రాలతో టాలీవుడ్ లో సూపర్ ఫాలోయింగ్ సంపాదించుకున్నారు కోలీవుడ్ స్టార్ హీరో విశాల్. ఈ మాస్ హీరో మూవీలకు తెలుగులో కూడా మంచి డిమాండ్ ఉన్న విషయం తెలిసిందే. యాక్షన్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్ అయిన విశాల్.. ప్రస్తుతం డైరెక్టర్ హరితో రత్నం మూవీ చేస్తున్నారు. ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్ గా రాబోతోందీ చిత్రం ఈ సినిమాను జీ స్టూడియోస్, స్టోన్ బెంచ్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తుండగా.. కార్తికేయన్ సంతానం నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీకి రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్, పాటలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. తాజాగా రత్నం మూవీ నుంచి అదిరిపోయే పాటను మేకర్స్ రిలీజ్ చేశారు. ఓ కళాశాలలో విడుదల చేసిన ఈ పాట.. సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. డోంట్ వర్రీ.. డోంట్ వర్రీ రా చిచ్చా అంటూ సాగుతున్న ఈ సాంగ్.. తెగ ఆకట్టుకుంటోంది. ఎంతో గ్యాప్ ఇచ్చి దేవిశ్రీ ప్రసాద్ ఈ పాటను ఆలపించారు. సాంగ్ లో సినిమాలోని విశాల్ క్యారెక్టర్, చిన్నతనం నుంచి హీరో పెరిగిన మొత్తం విధానాన్ని వివరించారు. ఈ సాంగ్ లిరిక్స్ ను శ్రీమణి అందించగా.. దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ మంచి ఎనర్జిటిక్ గా అనిపిస్తోంది. సాంగ్ లో విశాల్ డ్యాన్స్ తోపాటు హుక్ స్టెప్స్ ఆకట్టుకుంటున్నాయి. పాట రిలీజ్ అనంతరం విశాల్ వేడుకలో మాట్లాడారు. కాలేజ్ లో పాటను విడుదల చేయడం ఆనందంగా ఉందని విశాల్ తెలిపారు. డైరెక్టర్ హరి.. నా జీవితాన్ని చూసి ఈ పాటను రాయించాడా అని అనిపిస్తోందని చెప్పారు. ప్రస్తుతం రత్నం మూవీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. అయితే సమ్మర్ కానుకగా ఏప్రిల్ 26వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని ఇప్పటికే ప్రకటించారు మేకర్స్. ఇక ప్రమోషన్ల స్పీడ్ ను కూడా పెంచనున్నారు. వరుస అప్డేట్లతో సందడి చేయనున్నారు. మరి సాంగ్స్ తోనే మంచి హైప్ తీసుకొస్తున్న మేకర్స్.. ఈ సినిమాతో ఎలాంటి ఫలితం అందుకుంటారో చూడాలి.

ఓం భీమ్ బుష్ ట్రైలర్..నవ్వులే నవ్వులు!

టాలీవుడ్ యంగ్ హీరో శ్రీ విష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ మరో ఐదు రోజుల్లో ఓం భీమ్ బుష్ సినిమాతో థియేటర్లలోకి రాబోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే బ్రోచేవారెవరురా సినిమాలో కామెడీతో ఆకట్టుకున్న ఈ ట్రియో.. మరోసారి అలరించేందుకు సిద్ధమైంది. మార్చి 22వ తేదీన ఈ సినిమా విడుదల కానుంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్.. మూవీపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఈ సినిమాలో ఫిమేల్ లీడ్ రోల్స్ లో ప్రీతీ ముకుందన్, ఆయేషా ఖాన్ కనిపించనున్నారు. ఇక ఈ మూవీ ద్వారా కొత్త పాయింట్ ను తీసుకొస్తున్నామని ఇటీవల డైరెక్టర్ హర్ష కొనుగంటి చెప్పారు. టీజర్ కూడా ఫన్నీగా, ఇంట్రెస్టింగ్ గా సాగడంతో సినిమాపై ఆడియన్స్ లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా మేకర్స్.. మూవీ ట్రైలర్ ను విడుదల చేశారు. ఇక ట్రైలర్ కూడా ఆద్యంతం ఎంటర్టైనింగ్ గా సాగింది.ట్యాగ్ లైన్ నో లాజిక్.. ఓన్లీ మ్యాజిక్ కు తగ్గట్టు మూవీ విచిత్ర మలుపులు తిరుగుతుందని ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ముగ్గురు కూడా తమ కామెడీ టైమింగ్? తో అదరగొట్టారు. శ్రీవిష్ణు డైలాగ్ డెలివరీ విచిత్రంగా ఉంది. హీరోయిన్ల గ్లామర్ డోస్ కూడా బాగానే ఉంటుందని తెలుస్తోంది. సంపంగి మహల్? లోకి వీరు ముగ్గురు వెళ్లాక ఫన్ వేరే లెవల్. అయితే ఊరి పేరు ఏంటి అని ప్రియదర్శి అడిగితే సుస్వాగతం అని రాహుల్ రామకృష్ణ ఫన్నీ గా చెబుతారు. భైరవపురం అని చెప్పడు. ఆ తర్వాత భైరవపురం అని ప్రియదర్శి ఫ్రస్టేట్ అవడంతో ట్రైలర్ ముగిసింది. సంగీత దర్శకుడు సన్నీ అందించిన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ కూడా ఇంట్రెస్టింగ్ గా సాగింది. మొత్తానికి సినిమా మాత్రం పొట్ట చెక్కలయ్యేలా అందిరినీ నవ్వించేలా కనిపిస్తోంది.